క్లుప్తంగా

అనారోగ్యంతో వ్యక్తి మృతి


చేరాలు (ఫైల్)

శాయంపేట : మండలంలోని గట్లకానిపర్తి గ్రామానికి చెందిన సముద్రాల చేరాలు (55) సోమవారం అనారోగ్యంతో మృతిచెందాడు. చేరాలు కుమారుడు సముద్రాల వెంకటేశ్ తెలంగాణ ఉద్యమ సమయంలో ఆత్మబలిదానం చేసుకున్నాడు. ఒక్కగానొక్క కుమారుడు వెంకటేశ్ మృతితో మనోవేదనకు గురైన తండ్రి చేరాలు అనారోగ్యానికి గురయ్యాడు. కాగా పరిస్థితి విషమించి సోమవారం మృతిచెందాడు. మాజీ సర్పంచ్ సాంబయ్య, నాగార్జున స్కూల్ కరస్పాండెంట్ అశోక్, ఎంపీటీసీ రజినిసత్యం, గ్రామస్తులు రాజేందర్, కుమారస్వామి, రాజేందర్, సంతోష్, రాంబాబు, మురళి, భరత్, లింగమూర్తి, రమేష్, సురేందర్ మృతుడి భౌతికాయం వద్ద నివాళులర్పించారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

దామెర : గత మూడు నెలలుగా పెండింగ్‌లోఉన్న రెండో ఏఎన్ఎంల వేతనాలతో పాటు పీఆర్సీ బకాయిలు వెంటనే చెల్లించాలని తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం మండల వైద్యాధికారి డాక్టర్ మంజూలకు వినతిపత్రం, సమ్మె నోటీసు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జాతీయ ఆరోగ్య మిషన్‌లో పనిచేస్తున్న రెండో ఏఎన్ఎంలకు చెల్లించాల్సిన బకాయిలను ఈనెల 21 వరకు చెల్లించాలని కోరారు. లేని పక్షంలో 22వ తేదీ నుంచి సమ్మె నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఉమారాణి, భారతి, శోభారాణి తదితరులు ఉన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యం



నర్సంపేట : రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ మహబూబాబాద్ అభ్యర్థి ప్రొఫెసర్ సీతారాంనాయక్ గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఆ పార్టీ నర్సంపేట నియోజకవర్గ చేరికల కమిటీ చైర్మన్ డాక్టర్ గోగుల రాణాప్రతాప్‌రెడ్డి కోరారు. అన్ని బూత్‌ల్లో పది మందిని పార్టీలో చేర్చే కార్యక్రమాన్ని పట్టణంలోని రెండో డివిజన్‌లో సోమవారం చేపట్టారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ జుర్రు రాజుయాదవ్ ఆధ్వర్యంలో వివిధ పార్టీలకు చెందిన సుమారు 40 మంది నాయకులు, కార్యకర్తలు బీజేపీలో చేరగా వారికి రాణాప్రతాప్‌రెడ్డి కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడారు. బీజేపీ హయాంలోనే సుపరిపాలన అందుతుందని చెప్పారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక దేశం, రాష్ట్రం పురోగతి సాధిస్తున్నాయని తెలిపారు. దేశాన్ని అభివృద్ధి చేయడంలో ప్రధాని మోదీ అహోరాత్రులు శ్రమిస్తున్నారని వివరించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు శీలం రాంబాబు, మహబూబాబాద్ పార్లమెంటు కన్వీనర్ కట్ల రామచంద్రారెడ్డి, వరంగల్ జిల్లా జనరల్ సెక్రటరీ రేసు శ్రీనివాస్, నియోజకవర్గ కన్వీనర్ వడ్డేపల్లి నర్సింహరాములు, పట్టణ ఇన్‌చార్జ్ గుడిపూడి రాధాకృష్ణ, శ్రీరంగం సాగర్, పట్టణ ప్రధాన కార్యదర్శులు కొంపెల్లి రాజు, రామాంజనేయులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



పర్వతగిరి : సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి మండల కేంద్రంలో పెరిక కుల సంఘం నాయకులు సోమవారం క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడారు. పెరిక కార్పొరేషన్ ఏర్పాటు చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. ఆ కుల సంఘం అధ్యక్షుడు నరెడ్ల సమ్మయ్య, నాయకులు చింతకుంట్ల మల్లికార్జున్, మండల రవి, కంతం సుధాకర్, సముద్రాల వెంకన్న పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన కలిగిఉండాలి

నర్సంపేట : సీపీఆర్‌పై యువతకు అవగాహన అవసరమని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ స్నేహ తెలిపారు. పట్టణంలోని సిద్దార్థ డిగ్రీ, పీజీ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ గోగుల ప్రభాకర్‌రెడ్డి అధ్యక్షతన సోమవారం నిర్వహించిన అవగాహన సదస్సులో డాక్టర్ స్నేహ మాట్లాడారు. సీపీఆర్ విధానాన్ని వాలంటీర్ల సహాయంతో ప్రదర్శించారు. అనంతరం వాలంటీర్ల చేత ప్రాక్టీస్ చేయించారు. అనంతరం స్థానిక ప్రభుత్వ రక్తనిధి టెక్నీషియన్ రక్తదానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నాంపల్లి శ్రీనివాస్, శ్రీధర్, అశోక్, తదితరులు తదితరులు పాల్గొన్నారు.


ఎల్కతుర్తి : గురుకులంలోని పరీక్ష కేంద్రానికి చేరుకున్న విద్యార్థులు


శాయంపేట : ఎంజేపీ పరీక్ష కేంద్రంలో విద్యార్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది


ఐనవోలు : పున్నేలులోని పరీక్ష కేంద్రానికి వెళ్తున్న విద్యార్థులు

ప్రశాంతంగా ప్రారంభమైన 'పది' పరీక్షలు

- సమయానికంటే ముందే చేరుకున్న విద్యార్థులు
- పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు
- పరకాల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన కేంద్రంలో సౌకర్యాలు కరువు

ఎల్కతుర్తి : జిల్లా వ్యాప్తంగా పదోతరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు పదినిమిషాల ముందే చేరుకున్నారు. పరీక్ష కేంద్రాల వద్ద సమయం 5 నిమిషాలు పొడగించినప్పటికీ విద్యార్థులు సమయానికి చేరుకున్నారు. మండలంలో మొత్తం 349 మంది పదోతరగతి విద్యార్థులున్నారు. మండల కేంద్రంలో రెండు సెంటర్లకుగాను మొదటిరోజు జరిగిన వార్షిక పరీక్షల్లో గురుకుల పాఠశాల సెంటర్‌లో 180 మందికి పూర్తిస్థాయిలో హాజరైనట్లు అధికారులు వెల్లడించారు. మోడల్ పాఠశాలలో 169మంది విద్యార్థులకు 169 మంది విద్యార్థులు హాజరైనట్లు పేర్కొన్నారు. అలాగే భీమదేవరపల్లి మండలంలో ఏర్పాటు చేసిన రెండు సెంటర్లకుగాను మొత్తం 387 మంది విద్యార్థులు ఉన్నారు. మోడల్‌స్కూల్ సెంటర్‌లో 238, హైస్కూల్ సెంటర్‌లో 149కి పూర్తిస్థాయిలో హాజరై పరీక్షలు రాసినట్లు తెలిపారు. ఇదిలా ఉండగా పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించినట్లు పోలీస్‌లు తెలిపారు.

శాయంపేటలో..

శాయంపేట : మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబాపూలే బాలుర గురుకుల పాఠశాలలో, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో సోమవారం పదోతరగతి వార్షిక పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఎస్సై ప్రమోద్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు భద్రత కల్పించారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేసి కేంద్రానికి 100 మీటర్ల దూరంలో పిల్లల తల్లిదండ్రులు ఉండేలా చర్యలు తీసుకున్నారు. ఎంజేపీలో 120మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా జెడ్పీహెచ్ఎస్ బాలికల పాఠశాలలో 156మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. మాల్‌ప్రాక్టీస్‌కు తావులేకుండా సిట్టింగ్ స్క్వాడ్ పర్యవేక్షించారు.

వేలేరులో..

వేలేరు : పదోతరగతి వార్షిక పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. మండలంలో రెండు పరీక్ష కేంద్రాల్లో 251 మంది విద్యార్థులు పరీక్షలు రాసినట్లు అధికారులు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో 130మంది, సెయింట్ ఫ్రాన్సిస్ పాఠశాలలో 121 మంది విద్యార్థులు పరీక్షలు రాసినట్లు పేర్కొన్నారు. విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేసినట్లు ఎస్సై హరిత వెల్లడించారు.

కమలాపూర్‌లో..

కమలాపూర్ : మండల వ్యాప్తంగా పదోతరగతి పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో 195 మంది, బాలికల ఉన్నత పాఠశాలలో 140 మంది, తెలంగాణ మోడల్ స్కూల్‌లో 180 మంది, శనిగరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 99 మంది విద్యార్థుల చొప్పున నాలుగు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. మొదటిరోజు జరిగిన తెలుగు పరీక్షకు మొత్తం 614 మంది విద్యార్థులకు 613 మంది విద్యార్థులు హాజరై పరీక్ష రాశారని, శనిగరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఒకరు గైర్హాజరైనట్లు ఎంఈఓ ఇ.రాంకిషన్‌రాజు, పరీక్షల చీఫ్ సూపరిండెంట్లు, డిపార్ట్‌మెంటల్ అధికారులు తెలిపారు.

దామెరలో..

దామెర : పదోతరగతి వార్షిక పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమైనట్లు చీఫ్ సూరింటెండెంట్ సారంగపాణి తెలిపారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రంలో 271 మంది విద్యార్థులకు మొదటిరోజు తెలుగు పరీక్షకు అందరు విద్యార్థులు హాజరైనట్లు ఆయన తెలిపారు. ఎస్సై కొంక అశోక్ విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసి పరీక్షహాలులోని అనుమతించారు. పరీక్ష కేంద్రం వద్ద ఎలాంటి సంఘటనలు చోటుచేసుకోకుండా 144 సెక్షన్ నిర్వహించినట్లు ఎస్సై అశోక్ తెలిపారు.

పరకాలలో..

పరకాల : పదోతరగతి పరీక్షలు మొదటిరోజు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మూడు పరీక్ష కేంద్రాల్లో 581 మంది విద్యార్థులకు 579 మంది హాజరయ్యారు. ఇద్దరు విద్యార్థులు మాత్రమే గైర్హాజరయ్యారని మండల విద్యాశాఖాధికారి ఎస్.రమాదేవి తెలిపారు. మాస్‌కాపీయింగ్, పరీక్ష పత్రాలు బయటకు రాకుండా జిరాక్స్ సెంటర్లను మూసివేయించి 144 సెక్షన్ విధించి కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. కాగా తాగునీరు, మూత్రశాలల విషయంలో పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులు కొంత అసౌకర్యానికి గురయ్యారు. తాగునీరు అందించేందుకు సిబ్బంది లేకపోవడం, 100 మీటర్ల దూరంలో ఉన్న మూత్రశాలలుకు వెళ్లి వచ్చేందుకు సమయం వృధా అవుతుందని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేశారు. మూత్రశాలు లేవని బాలురు తెలిపారు.

ఐనవోలులో..

ఐనవోలు : పదోతరగతి పరీక్షకు 100 శాతం విద్యార్థులు హాజరైనట్లు ఎంఈఓ వెంకటేశ్వర్‌రావు తెలిపారు. పంథిని జెడ్పీహెచ్ఎస్‌లో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రంలో 159 మంది, పున్నేలు జెడ్పీహెచ్ఎస్ సెంటర్‌లో 115, ఐనవోలు జెడ్పీహెచ్ఎస్ సెంటర్‌లో 180, పాత్‌ఫైండర్ సెంటర్‌లో 290 మంది పరీక్షకు హాజరైనట్లు. మండల వ్యాప్తంగా 644 మంది విద్యార్థులకు 644 మంది హాజరైనట్లు ఎంఈఓ తెలిపారు. ఫ్లయింగ్‌స్క్వాడ్ రమాదేవి పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా స్థానిక ఎస్సై అనిల్‌కుమార్ బందోబస్తు నిర్వహించారు.

ఆత్మకూరులో..

ఆత్మకూరు : మండల కేంద్రంలో సోమవారం పదోతరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మూడు సెంటర్లు ఏర్పాటు చేయగా విద్యార్థులు ముందుగానే చేరుకున్నారు. మండల కేంద్రంలోని హైస్కూల్, ప్రభుత్వ జూనియర్ కళాశాల, సెయింట్ థెరిస్సా స్కూల్‌లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా 562మంది విద్యార్థులు హాజరై పరీక్ష రాసినట్లు అధికారులు తెలిపారు. పరీక్ష కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలు చేసి బందోబస్తు కల్పించినట్లు పోలీస్‌లు తెలిపారు.


పరకాల : పట్టణంలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రానికి వెళ్తున్న విద్యార్థులు


దామెర : విద్యార్థులను తనిఖీ చేస్తున్న స్థానిక ఎస్సై అశోక్


కమలాపూర్ : హాల్‌టికెట్ నంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు


ఆత్మకూరు : పరీక్ష రాసేందుకు కేంద్రంలోకి వెళ్తున్న విద్యార్థులు

ఆన్‌లైన్ యాప్‌లో మోసపోయి యువకుడు ఆత్మహత్య


దిలీప్(ఫైల్)

శాయంపేట: ఆన్‌లైన్ టెలిగ్రామ్ యాప్‌లో రూ. లక్షా 60వేల పెట్టుబడి పెట్టి మోసపోయిన విద్యార్థి ఆవుల దిలీప్(17) పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్సై ప్రమోద్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం రాజుపల్లికి చెందిన దిలీప్ ఇంటర్ ఫస్టియర్ చదువుతున్నాడు. ఆన్‌లైన్‌లో టెలిగ్రామ్ యాప్‌కు సంబంధించిన ఫేక్ ట్రేడింగ్‌లో రూ. లక్షా 60వేలు పెట్టి మోసపోయాడు. ఈ విషయం తండ్రి శ్రీనివాస్‌కు తెలిస్తే ఏ మవుతుందోననే భయంతో ఈనెల 3న తమ వ్యవసాయ భూమి వద్ద పురుగుల మందు సేవించి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. గమనించిన కుటుంబీకులు హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. ఈ ఘటనపై శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రమోద్‌కుమార్ తెలిపారు.

రేపు వేలంపాట

కమలాపూర్ : మండలంలోని ఉప్పల్‌లో ఈనెల 20వ తేదీన 2024–25 సంవత్సరానికిగాను కూరగాయల వారసంత (అంగడి), మినరల్ వాటర్ ప్లాంట్ నిర్వహణకు వేలంపాట నిర్వహించనున్నట్లు ప్రత్యేకాధికారి డాక్టర్ ఎ.వేణు, పంచాయతీ కార్యదర్శి బి.శ్రీనివాస్ సోమవారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు నిర్వహించే వేలం పాటలో పాల్గొనే వారు రూ.10 వేలు వేర్వేరుగా డిపాజిట్ చేసి వేలంపాటలో పాల్గొనాలని ఈ సందర్భంగా కోరారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

వేలేరు : అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్సై డి.హరిత సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని మల్లికుదుర్ల గ్రామానికి చెందిన బొజ్జ రాజు, బొజ్జ సమ్మయ్య అనుమతులు లేకుండా రెండు ట్రాక్టర్లలో గ్రామ శివారులోని వాగులో నుంచి ఇసుక తరలిస్తుండగా పట్టుకుని సిబ్బంది ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆమె తెలిపారు.

ప్రజాపాలన సేవాకేంద్రం మూసివేత

శాయంపేట : ఈనెల 16 నుంచి పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమలు కానున్న నేపథ్యంలో మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన సేవాకేంద్రం ప్రత్యేక కౌంటర్‌ను మూసివేసినట్లు ఎంపీడీఓ ఫణిచంద్ర సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.

ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు



ఆత్మకూరు : ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. లోకసభ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన సందర్భంలో ఎన్నికల నియమావళి అమలులోకి వచ్చిందన్నారు. ప్రభుత్వ కార్యాలయాల గోడలపై వాల్‌పోస్టర్లు, కటౌట్లు తొలగిస్తున్నట్లు తెలిపారు. కొత్తగా ఓటుహక్కు పొందేందుకు అర్హులందరూ అప్లై చేసుకోవాలని కోరారు. ఆధారాలు లేకుండా రూ.50వేలు మించి వెంటతీసుకుని ప్రయాణిస్తే సీజ్ చేస్తామన్నారు. ప్రతిఒక్కరూ ఎన్నికల నియమావళిని పాటించాలన్నారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ సంగీత, ఆర్ఐ రవీందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

చెన్నకేశవస్వామి జాతరను జయప్రదం చేయాలి


సురేష్, చైర్మన్

దామెర : చంద్రగిరి చెన్నకేశవస్వామి జాతరను జయప్రదం చేయాలని కమిటీ చైర్మన్ గుండ సురేష్(సురేందర్) పిలుపునిచ్చారు. మండలంలోని కోగిల్వాయి చెన్నకేశవస్వామి ఆలయంలో గ్రామ పెద్దలతో సోమవారం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి జాతర కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గుండా సురేష్(సురేందర్), వైస్‌చైర్మన్ పాలకుర్తి అశోక్, చుక్క సాంబయ్యను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా చైర్మన్ సురేష్ మాట్లాడుతూ.. ఈనెల 23 నుంచి ఎప్రిల్ 15వ తేదీ వరకు నిర్వహించనున్న జాతరకు భక్తులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఎంపీటీసీ మానికకిరణ్, చందర్, వేణు, కారోబార్ సురేష్, సాంబయ్య, పైడి, సందీప్, భిక్షపతి, రఘు, రమేష్, రాజు పాల్గొన్నారు.

వైభవంగా కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు


చైతన్యపురి కాలనీలో ఉత్సవ విగ్రహాల ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

కాజీపేట: చైతన్యపురికాలనీ పద్మావతి, గోదాదేవి సమేత వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు కనుల పండువగా సాగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండోరోజు సోమవారం వేదపండితులు యాగశాలలో హోమం, అగ్ని ప్రతిష్ఠ, ధ్వజస్తంభం వద్ద ధ్వజారోహణం చేసి మూర్తి కుంభస్థాపనం చేశారు. మాజీ ఎమ్మెల్యే వినయ్‌భాస్కర్, ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు పంజాల అశోక్‌కుమార్, మేజర్ వడ్డెపల్లి నరేందర్.. భక్తులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. డప్పు, వాయిద్యాలతో ఉత్సవ విగ్రహాలను ఆలయ పండితులతో కలిసి శేష వాహనంపై పుర వీధుల్లో ఊరేగించారు. పండితులు భేరీపూజ, దేవతాహ్వానం, నిత్యహోమం, శ్రీమద్రామాయణ వెంకటాచల మహత్య పారాయణం, సామూహిక లక్ష్మి అర్చనలు జరిపించారు. మంగళవారం రాత్రి జరగనున్న స్వామి వారి కల్యాణ మహోత్సవానికి వధువరూల పక్షాన కాలనీ పెద్దలు, అర్చకులు పెళ్లి పెద్దలుగా వ్యవహరించారు. అర్చకుడు శ్రీనివాసాచార్యులు దేవతామూర్తులకు అభిషేకాలు, అర్చనలు చేశారు.

పేదల పక్షపాతి కాంగ్రెస్ పార్టీ : నాయిని


కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న కార్యకర్తలు

నయీంనగర్: బడుగు, బలహీన వర్గాలు, పేదల సంక్షేమం కేవలం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. 53వ డివిజన్ లష్కర్ సింగారంలో రేణుకుంట్ల ప్రవీణ్ ఆధ్వర్యంలో డివిజన్‌కు చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీలో సోమవారం చేరారు. ఈ సందర్భంగా వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆరు గ్యారంటీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నట్లు చెప్పారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చే విధంగా కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. కార్యకర్తలు, నాయకులు సమన్వయంగా ఉంటూ ఎంపీ అభ్యర్థి గెలుపునకు సైనికుల్లా పనిచేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో నాయకులు ఆనంద్, అశోక్‌రావు, బాబా బాయ్, కావ్య, మహేందర్, బంక సరళ, పుల్ల చిన్నా, నద్దునూరి రవి, ఎర్ర సంజీవ, బొక్క రవి, సిలువేరు కిరణ్, రేణుకుంట్ల కిరణ్, నవీన్, భర్తపురం కిరణ్‌తో పాటు కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల కవాతు


కవాతు చేస్తున్న పోలీసులు

పర్వతగిరి : మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ నుంచి అంబేడ్కర్ సెంటర్ మీదుగా పద్మశాలి కాలనీతోపాటు పలు వీధుల్లో పోలీసులు సోమవారం కవాతు చేపట్టారు. ఏసీపీ బి.తిరుపతి మాట్లాడారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో రాజకీయ పార్టీల నాయకులు, ప్రజలు ఎన్నికల నియమావళిని పాటించాలని సూచించారు. సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సీఐ శ్రీనివాస్, ఎస్సై వెంకన్న, సీఆర్పీఎఫ్ సీఐ విజయ్ పాల్గొన్నారు.

'కుమారస్వామినే అధ్యక్షుడిగా కొనసాగించాలి'

వర్ధన్నపేట : కాంగ్రెస్ ప్రస్తుత అధ్యక్షుడు చిదురాల కుమారస్వామినే మళ్లీ పట్టణ అధ్యక్షుడిగా కొనసాగించాలని ఆ పార్టీ సీనియర్ నాయకులు మహ్మద్ అఫ్సర్, సమ్మెట సుధీర్ కోరారు. ఈ మేరకు స్థానిక ఎమ్మెల్యే కేఆర్.నాగరాజును కలిసిన విజ్ఞప్తి చేశారు. అనంతరం పట్టణంలో సోమవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. కుమారస్వామి పట్టణ అధ్యక్షుడిగా పార్టీ బలోపేతానికి విశేష కృషి చేశారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో లేని సమయంలో అప్పుడు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ నాయకుల నుంచి అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని చెప్పారు. పార్టీతో సంబంధం లేని వ్యక్తిని పట్టణ అధ్యక్షుడిగా నియమించడం సరికాదన్నారు. సమస్యను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. అనంతరం చిదురాల కుమారస్వామి మాట్లాడారు. తాను నిత్యం పార్టీ బలోపేతానికి పాటుపడినట్టు తెలిపారు. సమావేశంలో నాయకులు బచ్చు గంగాధర్‌రావు, శివరాత్రి వెంకటనర్సు, కొండేటి బాలకృష్ణ, ఐత సుధాకర్, ఎర్ర ప్రేమ్‌రాజ్, సమ్మెట రాంబాబు, షబ్బీర్, మంజూర్, బంగారు సదానందం, ఎల్లస్వామి, మురళి, చందు మల్లయ్య, జగన్, నవీన్‌తో పాటు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నామినేటెడ్ పదవుల్లో అన్యాయం



కేయూ క్యాంపస్: రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల 37మందికి నామినేటెడ్ పదవులు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీచేసిందని, అందులో ఎస్సీ, ఎస్టీలకు అన్యాయం జరిగిందని ఏబీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మంద నరేష్ వాపోయారు. కాకతీయ యూనివర్సిటీలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి తన సామాజిక వర్గానికే ఎక్కువగా నామినేటెడ్ పదవులు ఇచ్చారని అన్నారు. నామినేటెడ్ పదవుల వ్యవహారంలో సీఎం పునరాలోచించి న్యాయం చేయాలని కోరారు. కాకతీయ యూనివర్సిటీ విద్యార్థి ఉద్యమకారులకు సముచిత స్థానం కల్పించాలన్నారు. సమావేశంలో ఏబీఎస్ఎఫ్ కేయూ అధ్యక్షుడు మచ్చ పవన్‌కల్యాణ్, పృథ్వీరాజ్, వివేక్, సునీల్, వెంకటేష్, సాయికిరణ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి పార్టీలో చేరికలు


శ్రీనివాసరావుకు కండువాకప్పి ఆహ్వానిస్తున్న ప్రణవ్

కమలాపూర్ : ఎన్నికల సమయంలో ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ అభివృద్ధి చేస్తున్న కాంగ్రెస్ పార్టీ తీరును చూసే వివిధ పార్టీల నుంచి కార్యకర్తలు, నాయకులు చేరుతున్నట్లు ఆ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఒడితల ప్రణవ్ అన్నారు. మండలంలోని కన్నూరు, వంగపల్లి, గూడూరు, కొత్తపల్లి గ్రామాలకు చెందిన సుమారు 300 మంది బీఆర్ఎస్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు సోమవారం కాంగ్రెస్ పార్టీలో చేరగా ఆయన కండువా కప్పి ఆహ్వానించారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసిన కార్యకర్తలను కంటికిరెప్పలా కాపాడుకుంటానని అన్నారు. రేషన్ డీలర్ల సంఘం మండల అధ్యక్షుడు పుల్లూరి శ్రీనివాసరావు, మాజీ ఎంపీటీసీ కొలిపాక సాంబయ్య, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు పబ్బు రాంచంద్రం, బండారి సంపత్, కుమ్మరి బాబు, పాక చంద్రమౌళి, నేరెళ్ల చంద్రమౌళి, సర్మెట శ్రీనివాస్, పాక రమేష్, కిన్నెర తిరుపతి పార్టీలో చేరినవారిలో ఉన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ కో ఆర్డినేటర్ రవీందర్, నాయకులు రమేష్‌గౌడ్, ఐలయ్యగౌడ్, చరణ్‌పటేల్, భిక్షపతి, వంశీధర్‌రావు, ప్రభాకర్, రాజిరెడ్డి, ఓదెలు, కనుకరత్నం, సురేష్, అశోక్ రావుతో పాటు తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రీయ పద్ధతితోనే అధిక లాభాలు

- ముల్కనూరు డెయిరీ జీఎం భాస్కర్‌రెడ్డి


పశువైద్య శిబిరంలో పాల్గొన్న వైద్యులు

ఎల్కతుర్తి : శాస్త్రీయ పద్ధతిలో పశుపోషణ చేపడితే పాల దిగుబడి పెరిగి రైతులు అధిక లాభాలు పొందవచ్చని ముల్కనూరు డెయిరీ జీఎం భాస్కర్‌రెడ్డి అన్నారు. పీవీ నర్సింహారావు తెలంగాణ పశువైద్య విశ్వవిద్యాలయం, పశువైద్య కళాశాల, జాతీయ సేవా పథకంలో భాగంగా ఏడురోజుల పశువైద్య శిబిరం చేపట్టగా సోమవారం భీమదేవరపల్లి మండలం గట్లనర్సింగాపూర్ కొనసాగింది. ఈ సందర్భంగా భాస్కర్‌రెడ్డి మాట్లాడారు. ముల్కనూరు మహిళా సహకార సొసైటీ ఆధ్వర్యంలో 200లకు పైగా గ్రామాల్లో సుమారు 24వేల మంది మహిళల సహకారంతో రోజువారీగా 68వేల లీటర్ల పాల ఉత్పత్తి జరుగుతుందన్నారు. అలాగే సరైన కృత్రిమధరణ పద్ధతి పాటిస్తే అధిక పాల దిగుబడితో ఆర్థికాభివృద్ధి సాధిస్తారని అన్నారు. ప్రత్యేక వైద్య శిబిరం ద్వారా 33 పశువులకు గర్భకోశ సంబధిత వ్యాధుల చికిత్స, చూడి నిర్ధారణ పరీక్షలు చేయడంతో పాటు 63 పశువులకు సాధారణ వైద్యం, 3పశువులకు శస్త్ర చికిత్సలు నిర్వహించినట్లు వైద్యులు పేర్కొన్నారు. డాక్టర్ వెంకట్‌నారాయణ (డీవీఏహెచ్ఓ), బాలకృష్ణ, ఈఓ డాక్టర్ శ్రీధర్, డైరీ చైర్మన్ ధనశ్రీ, సుభాష్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సన్మానం

నర్సంపేట : తెలంగాణ రాష్ట్ర కోఆపరేటివ్ ఆయిల్ సీడ్స్ గ్రోవర్స్ ఫెడరేషన్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన జంగా రాఘవరెడ్డి హనుమకొండలోని నివాసంలో స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డిని సోమవారం సన్మానించారు. తొలుత పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు.